ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 05 | జూలై | 2024
పేజీలు 8


# నేడు కలెక్టరేట్ల ముట్టడి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా సింగరేణిలో బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు, అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకోవాలని, తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తిని సింగరేణి ద్వారానే జరపాలని వామపక్షాలు ఆందోళనకు పిలుపునిచ్చాయి. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చాయి. బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపి వేయాలని, సింగరేణిని పరిరక్షించాలని వామపక్షాలు ముఖ్యంగా సిపిఐ దీర్ఘకాలిక పోరాటానికి పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ వైపు పరుగులు పెడుతుందని ఆ క్రమంలోనే సింగరేణి పరిధిలోని బొగ్గు బావులను సైతం ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తుందని వామపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బొగ్గు బ్లాకుల వేలాన్ని ఉపసంహరించుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా లు తెలిపారు. సింగరేణి లో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వం ఉపసంహరించుకునేలా చేస్తామని అప్పటి వరకు ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయన్నారు.

**బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ నేడు ఆందోళన**

## భూ వివాదాల్లో జాప్యం శాపమై..

# నైరాశ్యంలోకి రైతన్నలు..!




## ఖమ్మం జిల్లాలో మరో రైతు ఆత్మహత్యాయత్నం

భూ వివాదాలలో జరుగుతున్న తీవ్ర జాప్యం రైతన్నలకు శాపంగా మారింది. సంవత్సరాల తరబడి గ్రామ పెద్దల నుంచి రెవెన్యూ కార్యాలయాలు, న్యాయస్థానాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కకపోవడంతో నైరాశ్యానికి గురై ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు. ఖమ్మంజిల్లాలో రెండు రోజుల క్రితం జరిగిన బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్య ఘటన మరువక ముందే కారేపల్లి మండలంలో మరో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మాజీ ఐపిఎస్ అధికారి తన భూమిని ఆక్రమించాడని ఏం చేసినా ఫలితం దక్కకపోవడంతో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

-ప్రజాపక్షం/ఖమ్మం


2 లో



# మరో రైతు ఆత్మహత్యాయత్నం



**-కొందరు తమ భూమిని కబ్జా చేశారని ఆరోపణ**
**మాజీ ఆర్టిఐ కమిషనర్**
**-బెదిరిస్తున్నాడంటూ ఆవేదన**
**-గిరిజనేతర రైతులపై ఎల్‌టిఆర్ కేసులు**



**ప్రజాపక్షం/ కారేపల్లి :** భూ వివాదంలో మరో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. మండల పరిధిలోని ఉసిరికాయల పల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల భద్రయ్య గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే... పచ్చిపాల మల్లయ్య, రామయ్య, భద్రయ్య, సోమయ్య అనే నలుగురికి కలిపి వారసత్వంగా 20 ఎకరాల భూమి వచ్చింది. దీనిలో నుండి మల్లయ్య, రామయ్య, సోమయ్య భూమిని మాజీ ఆర్టిఐ కమిషనర్ గిరిజన చట్టాన్ని అడ్డు చూపి బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. మీపై ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేస్తానని బెదిరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పచ్చిపాల భద్రయ్య భూమి అమ్మలేదు. కొనుగోలు చేసిన శంకర్

మిగతా 2లో..

## విద్యా సంస్థల బంద్

# సంపూర్ణం.. ప్రశాంతం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నీట్ పేపర్ లీకేజీ ని నిరసిస్తూ అఖిలపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు ఉమ్మడి ఖమ్మంజిల్లాలో విజయవంతమైంది, ప్రశాంతంగా జరిగింది. ఖమ్మం నగరం సహా, పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోను విద్యా సంస్థలు మూతపడ్డాయి.

మిగతా 2లో..

**-మారుమూల గ్రామాల్లోనూ మూతపడిన విద్యాసంస్థలు**
**-నీట్ పేపర్ లీకుకు మోడీయే బాధ్యత వహించి రాజీనామా చేయాలన్న విద్యార్థి సంఘాలు**

## భూ వివాదాల్లో జాప్యం శాపమై..

# నైరాశ్యంలోకి రైతన్నలు..!

ప్రజాపక్షం/ఖమ్మం : భూ వివాదాలలో జరుగుతున్న తీవ్ర జాప్యం రైతన్నలకు శాపంగా మారింది. సంవత్సరాల తరబడి గ్రామ పెద్దల నుంచి రెవెన్యూ కార్యాలయాలు, న్యాయస్థానాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కకపోవడంతో నైరాశ్యానికి గురై ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారు. ఖమ్మంజిల్లాలో రెండు రోజుల క్రితం జరిగిన బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్య ఘటన మరువక ముందే కారేపల్లి మండలంలో మరో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మాజీ ఐపిఎస్ అధికారి తన భూమిని ఆక్రమించాడని ఏం చేసినా ఫలితం దక్కకపోవడంతో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి పంచాయితీకి చెందిన పచ్చిపాల భద్రయ్య తనకున్న 1.20 ఎకరాల భూమిని మాజీ ఆర్టిఐ కమిషనర్ గుగులోత్ శంకర్ నాయక్ ఆక్రమించాడని ఆరోపిస్తూ చేలోనే పురుగు మందు సేవించాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఇల్లందు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. భూ వివాదాలకు సత్వర పరిష్కారం లభించడం లేదు. సంవత్సరాల తరబడి తిరిగినా ఎటువంటి ఫలితం దక్కడం లేదు. సర్వే నెంబర్లలో పొరపాట్లు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఒకరి భూమి మరోకరి పేరున రికార్డుల్లో నమోదు కావడం, కొన్ని పట్టా భూములను ఇతరులు తమ పేరున పట్టా చేయించుకోవడం లేదా ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో ఉండడం జరిగింది. వీటి పరిష్కారానికి గ్రామస్థాయి నుంచి హైకోర్టు వరకు తిరిగినా ఫలితం దక్కడం లేదు. ఉదాహరణకు వడ్లమూడి వెంకటేశ్వరరావు అనే రైతుకు కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలో భూమి ఉన్నది. దాదాపు 100 సంవత్సరాలుగా ఆ భూమిని వడ్లమూడి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు సేద్యం చేసుకుంటున్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఈ భూమి తమదంటూ మీ భూమి వేరే చోట ఉన్నదంటూ దున్ననివ్వకుండా అడ్డుతగిలారు. ఐదేండ్లుగా మండల రెవెన్యూ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ తిరిగినా ఈ పేద రైతు సమస్య పరిష్కారం కాలేదు. తన భూమిని తనకు అప్పగించండి ఆ భూమిపై ఆధారపడి బతుకుతున్నామని మొరపెట్టుకున్నా ఆ మొర అలకించిన నాధుడు లేదు. ఇటువంటి ఘటనలు కొకొల్లలు. కొంత మంది వాస్తవ సాగులో ఉన్న విస్తీర్ణం కంటే పట్టాదారు పాసుపుస్తకాల్లో తక్కువ భూమి ఉన్నట్లు చూపించారు. మా భూమి మా ఆధీనంలోనే ఉంది దీనికి పరిష్కారం చూపి మిగులు భూమిని తమ పేరున రికార్డుల్లో నమోదు చేయండి అని తిరిగినా ఫలితం ఉండడం లేదు. సరిహద్దు సమస్యలు, గ్రామ కంతాల సంగతి సరే సరి. భూ వివాదాల్లో జరుగుతున్న జాప్యం పలు ఘర్షణలకు కూడా తావిస్తుంది. ఇప్పటికే చాలా మంది రైతులు తమ భూమి తమకు దక్కదని ఆత్మహత్యలకు సైతం పాల్పడిన ఘటనలు విధితమే. ఖమ్మంజిల్లాలో మూడు నెలల కాలంలో నలుగురైదుగురు ఈ భూ వివాద ఘటనలో హత్యలకు గురయ్యారు. ప్రభుత్వం తక్షణం ఈ భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి నిర్దేశిత సమయంలో వివాదాలను పరిష్కరించాల్సి ఉంది.

# మరో రైతు ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

నాయక్ భూమి మధ్యలో భద్రయ్య భూమి ఉండడంతో భద్రయ్య భూమిని కూడా తన భార్య పేరు పై పట్టా చేయించుకున్నాడు. ఈ భూ కబ్జా విషయమై భద్రయ్య అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు భద్రాచలం మొబైల్ కోర్టును ఆశ్రయించి కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకు వచ్చాడు. ఈ ఆర్డర్ కాపీని పోలీస్ స్టేషన్‌లో సమర్పించిన తర్వాత కూడా ఆయనకు ఎటువంటి ఫలితం దక్కలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భద్రయ్య పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భద్రయ్యను ఇల్లందుకు ఆ తర్వాత ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. రెవెన్యూ వ్యవస్థలో కొందరు అధికారులు మండలంలోని గిరిజనేతర రైతులను బెదిరించి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. 1/70 చట్టాన్ని చూపుతూ గిరిజనేతర రైతులను రెవెన్యూ అధికారులే బెదిరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. భద్రయ్య భూమి విక్రయించకుండానే ఎలా ఇతరుల పేరున భూ రికార్డుల్లో నమోదు చేశారని మండల రైతులు



ప్రశ్నిస్తున్నారు. పచ్చిపాల భద్రయ్య భూమి కబ్జా వ్యవహారంలో మండల అధికారుల హస్తం ఉందని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఈ మొత్తం వ్యవహారం పై విచారణ జరిపించాలని కోరుతున్నారు.

# విద్యా సంస్థల బంద్ సంపూర్ణం, ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్బంగా ఏఐఎస్ఎఫ్ ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. వైరా, మధిర, కొత్తగూడెం, సత్తుపల్లి, మణుగూరు, భద్రాచలం, ఇల్లందులో భారీ ర్యాలీలు నిర్వహించి మోడీ రాజీనామాకు డిమాండ్ చేశారు. ఖమ్మంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థలను మూసివేయించి భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాని మోడీ లు రాజీనామా చేయాలని మొత్తం లీకీజీపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణకు మోడీ ఎందుకు జంకుతున్నారని వారు ప్రశ్నించారు. నీట్ పేపర్ లీకు అవకతవకల నేపథ్యంలో దేశమంతా ఆందోళనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. నీట్ పరీక్షలో 23.33 లక్షల మంది పాల్గొన్నారని యుజిసిఎన్ఈటిలో 11 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఇంత మంది జీవితాలతో చెలగాటమాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు విఫలమయ్యారని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, వివిధ సంఘాల నాయకులు మధు, ప్రతాప్, ప్రభాస్, రోహిత్, గౌతమ్, చరణ్, వినోదరావు, మనోజ్, సరళ, చింతల రమేష్, భూక్యా ఉపేందర్, సాగర్ ఆర్‌కె, భాను, వినోద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ అగస్త్య జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్బంగా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

## మహిళపై మరో మహిళ కత్తితో దాడి



ప్రజాపక్షం/ ఖమ్మం : అక్రమ సంబంధం నేపథ్యంలో మహిళపై మరో మహిళ దాడి చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లో జరిగింది. శిరీష అనే మహిళపై పావని అనే మహిళ కత్తితో దాడి చేసింది. శిరీష ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న శిరీష పై దాడి చేసినట్లు సమాచారం. శిరీష పావని భర్త దుర్గాప్రసాద్ తో అక్రమ సంబంధం పెట్టుకుందని అందుకే దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు భరోసాపై సమావేశం




ప్రజాపక్షం/ బోనకల్ : మండల పరిధిలోని నారాయణ పురం, కలకోట, పెద్దబీరవల్లి, మోటమర్రి సహకార సంఘాల పరిధిలో రైతు భరోసా పథకంపై గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు సాగు చేసే ప్రతిఒక్క రైతుకి రైతు భరోసా వర్తింపచేయాలని, బీడు భూములు, సాగులో లేని భూములకు రైతు భరోసా నిలిపివేయాలని రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకారం సంఘం చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, బోజెడ్ల పుల్లారావు, ఉపాధ్యక్షులు కరివేద సుధాకర్, వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి సర్వసుద్రి సరిత, జిల్లా సహకార అధికారి ఎం.పత్యానాయ్, అసిస్టెంట్ రిజిస్టర్ కె.సందీప్‌కుమార్, ఎఇఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో మున్సిపల్ కార్మికునికి గాయాలు

### పరామర్శించిన ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ గిద్దాడ నగేష్



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: కొత్తగూడెం మున్సిపాలిటీలోని ఫిల్టర్ నందు బుధవారం రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న మాచర్ల రవికుమార్‌కు గాయాలయ్యాయి.చికిత్స పొందుతున్న రవికుమార్ గిద్దాడ నగేష్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో భాగంగా రవికుమార్ పంపువాల్ బంద్ చేసి క్రిందికి దిగుతుండగా కాలుజారిపడ్డాడు. కొత్తగూడెం మున్సిపాలిటీకి త్రాగునీరు సరఫరా చేసి ఫిల్టర్ బెడ్‌లో పనిచేసే కార్మికులకు విధుల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇల్లందు క్రాస్ రోడ్డు నందు గల ఫిల్టర్‌లో రాత్రి సమయంలో విధులు నిర్వహించే కార్మికుల పట్ల మున్సిపాల్‌శాఖ అధికారులు తగు రక్షణ చర్యలు చేపట్టి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయిలు, ముత్తారం నాగభూషణం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ ఎస్ఐగా రవూఫ్ బాధ్యతలు స్వీకరణ



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండల పోలీస్‌స్టేషన్ ఆడిషనల్ ఎస్ఐగా రవూఫ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన గతంలో ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతిరెడ్డి, సిఐ రాజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బోకేను అందజేశారు.

## సూపరిండెంట్ శ్రీనివాస్‌గౌడ్ భౌతికాయానికి నివాళి



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని గుర్రాలపాడు పంచాయతీలో నివాసం ఉంటున్న ముదిగొండ మండల పరిషత్ ఆఫీస్ సూపరిండెట్ శ్రీనివాస్‌గౌడ్ గురువారం మృతి చెందాడు. ఇంటి వద్ద ఉంచిన భౌతికకాయాన్ని ముదిగొండ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. నివాళులర్పించిన వారిలో ఎంపిడీఓ శ్రీధర్, స్వామి, ఎంపీఓ సూర్యనారాయణ, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక మహాజన సభా సమావేశం ఏర్పాటు



ప్రజాపక్షం/అశ్వాపురం: నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక మహాజన సభా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి అధ్యక్షులుగా సంఘం అధ్యక్షులు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఏడిఏ తాతారావులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ నెల్లిపాక పరిధిలో గల రైతులు, సహకార సంఘ సభ్యులు అందరూ పాల్గొని తమ యొక్క సూచనలు, సలహాలు రైతు భరోసా పథకంపై అందించారు. ఎక్కువ మంది రైతులు, ఎన్ని ఎకరాలు ఉన్నప్పటికీ సాగులో ఉన్న 10 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తింపజేయాలని సమావేశంలో పాల్గొన్న రైతులు, సంఘ సభ్యులు తమ యొక్క అభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉన్నారు. అందరి నిర్ణయం మేరకు ప్రత్యేక మహాజన సభ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. ఈకార్యక్రమంలో ఏవో సాయి శాంతన్, ఎంపిటిసి కమటం నరేష్, సీనియర్ ఇన్స్పెక్టర్ హనుమాన్, సంఘం డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు అందించాలి



ప్రజాపక్షం/మణుగూరు: మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు అందించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి రాజేందర్ మున్సిపల్ అధికారులను కోరారు. గురువారం ఈ విషయంపై మణుగూరు మున్సిపల్ కమిషనర్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వర్షా కాలం కావడం వలన రెయిన్ కోట్లు లేకుండా పని చేయడం వలన వర్షం వస్తే వర్షం లో తడిస్తే జలుబు, జ్వరం లాంటి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఐ ఎఫ్ టి యు మణుగూరు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. వెంకటేశ్వర్లు, పి. లక్ష్మి నారాయణ, ఉపాధ్యక్షులు పి.నరసింహారావు నాయకులు సురేష్ ,కోటి, రవి , దుర్గయ్య , సరస్వతి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐలో రెండవ విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రజాపక్షం/మణుగూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీలలో రెండో విడత ప్రవేశాల కోసం ఈ నెల 4 నుంచి 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లోని ఎలక్ట్రిషన్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, డీజిల్ మెకానిక్ , కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 15 లోగా సమీపంలోని ప్రభుత్వ ఐటిఐ లో దరఖాస్తులు ఆన్లైన్ చేసుకోవడానికి ప్రత్యేక సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. www. ititelangana. gov.in అనే వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇటీవల సప్లమెంటరీలో పదవ తరగతి పాసైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మొదటి విడత దరఖాస్తు చేసుకొని సీటు రానివారు ఆప్షన్ పెట్టుకోవాలి అని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9440206990కు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

## వ్యవసాయ కూలీలకు రేట్లు పెంచాలని మహిళల ఆందోళన



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలాల్లోని వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచాలని మణుగూరు, అ న్నారం, శివలింగాపురం, గుట్ట మల్లా రం, శాస్త్రి నగర్ కు సంబంధించిన మేస్త్రీలు గురువారం శివాలయంలో సమావేశం అయ్యారు. పత్తి కూలి మరియు కలుపు లకు రోజుకు 250 రూపాయలు చొప్పున ఇస్తున్నారని, 300 రూపాయలు ఇవ్వాలని (రోజువారి కూలి) ఎకరం వారికి నాటుకు ఐదు వేల రూపాయలు ఇవ్వాలని, పొద్దంతా కష్టపడి పని చేస్తే మిగిలేది లేకుండా పోతుందని రైతులు దీన్ని ఆలోచించి కూలీ రేటు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులు మాకు కూలి రేట్లు పెంచకుండా పక్క ఊరు నుంచి పని వాళ్ళని తీసుకువచ్చి పని చేయించుకుంటామని చెప్పడం సరైనది కాదని, మా జీవన భృతి కూడా ఆలోచించాలని వారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు, ధనమ్మ, నాగలక్ష్మి , కుమారి, సరస్వతి, కారం లక్ష్మి , అరుణ, జయమ్మ ,లక్ష్మి మరియు మరి కొంతమంది మహిళలు పాల్గొన్నారు.

# మడుపల్లిలో మట్టి దందా..!

- మితిమీరిపోతున్న మట్టి మాఫియా ఆగడాలు
- అక్రమ మట్టి తోలకాలను నియంత్రించాలి : సిపిఐ





ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లిలో మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. మడుపల్లిలో అక్రమ మట్టి తోలకాలను సిపిఐ నాయకులు, రైతులు అడ్డుకుని నిరసనలు, ధర్నాలు చేస్తున్నా అక్రమ మట్టి తోలకాలు ఆగటం లేదు. సంబంధిత అధికారులు, ఓ అధికార పార్టీ నాయకుడి అండదండలతోనే అక్రమ మట్టి తోలకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఆరోపణలు విన్పిస్తున్నాయి. రైతుల పొలాలకు మట్టి తోలుకునేందుకు పర్మిషన్ తీసుకుని ఆ మట్టిని కమర్షియల్‌గా గృహాల అవసరాలకు అక్రమంగా మట్టి తరలిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గత రెండు నెలలుగా అక్రమ మట్టి తోలకాలు జరుగుతుండగా దీనిపై సిపిఐ నాయకులు, గ్రామ ప్రజలు, రైతులు అడ్డుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడంపై పలు విమర్శలకు తావిస్తుంది. రాత్రనక, పగలనక నిత్యం వందలాది లారీలు, ట్రాక్టర్లలో అక్రమ మట్టి తోలకాలు జరుగుతున్నపటికీ సంబంధిత అధికారులు ఆమ్యామ్యాలకు కక్కుర్తిపడి చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు విన్పిస్తున్నాయి. స్వయంగా డిప్యూటీ సిఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క అక్రమ మట్టి తోలకాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించనప్పటికీ అక్రమ మట్టి తోలకాలు ఆగకపోవటం విశేషం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ మట్టి తోలకాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ మట్టి తోలకాలను నియంత్రించాలి : అన్నవరపు సత్యనారాయణ, సిపిఐ మండల నాయకులు**

మధిర మున్సిపాల్టీలోని మడుపల్లిలో అక్రమ మట్టి తోలకాలు యథేచ్ఛగా జరుగుతోంది. చెరువులోని మట్టి రైతుల పొలాలకు తరలించి వాడుకోవాల్సి ఉండగా దీనికి విరుద్ధంగా రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని గృహ అవసరాలకు తరలిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ మట్టి తోలకాలకు అడ్డుకట్ట వేసి మట్టి మాఫియా ఆడగాలను నియంత్రించాలి.

# కౌలు రైతుల కష్టాలు తీరేనా..!

-కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు
-సర్కార్ సహాయం అందేనా..?
-అప్పుల ఊబిలోకి రైతన్నలు




ప్రజాపక్షం/పినపాక: రాష్ట్రంలో నవంబర్ నెలలో జరిగిన సార్వత్రిక శాసన సభ ఎన్నికల ప్రచార సమయంలో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కౌలు రైతులకు అండగా ఉంటామని భరోసాను కల్పించింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులకు పెట్టుబడి సాయం క్రింద సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఎన్నికలలో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీపై కౌలు రైతులు గంపడాశతో ఎదురు చూస్తున్నారు.వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని బతుకుతున్న కౌలు రైతుల కుటుంబాలు ఆరు గాలం కష్టించి పంటలు సాగు చేస్తున్న కౌలు రైతుల కష్టాలకు తగ్గ ప్రతిఫలం దక్కేనా అని కౌలు రైతులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కష్టపడి సాగు చేసిన పంటలు చేతి కందే సమయంలో ప్రకృతి వైపరీత్యాల కోరలలో చిక్కుకొని విల విలలాడి పోతున్నామని నష్టాలను అనుభవిస్తున్నామని కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతమని వారు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి చేతికి రాక చివరకు కౌలు రైతులు అప్పుల పాలై ఆర్థిక ఇబ్బందులలో చితికి పోవాల్సి వస్తుందని చెబుతున్నారు. సమయానుకూలంగా పంటలు చేతి కందినా సరైన గిట్టుబాటు ధర లభించక మరీ నష్టపోతున్నామని రైతులు తెలియజేస్తున్నారు. పినపాక మండల పరిధిలో మెట్ట భూమి సాగుకు అనుకూలంగా ఉంటుంది. పట్టాదారు రైతులు 40 శాతం మంది ఉండగా, అందులో సుమారు 60 శాతం మంది కౌలు రైతులు కౌలుకు తీసుకొని భూమిని సాగు చేస్తున్నారు. పినపాక మండల పరిధిలోని కౌలు రైతులు వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తారు. గత ఏడాది అనుకూల సమయంలో వర్షాలు కురవడం పత్తి పంట దిగుబడి రాక సగానికి పైగా తగ్గడం మిర్చి పంటకు మొక్క దశలోనే బొబ్బర రోగం సోకి పెట్టుబడి ఎక్కువై అనుకున్న దశలో దిగుబడి రాక పోవడంతో అప్పుల ఊబిలో కూరుకు పోయామని ఆవేదన చెందుతున్నారు. ఒక ఎకరం పొలం కౌలుకు తీసుకోవాలంటే సుమారు 20 వేల నుండి 30 వేల రూపాయల వరకు రైతుకు కౌలు డబ్బులు ముందు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. సరైన పంటలు పండక పంటలు దెబ్బతిన్న రైతుకు కౌలు చెల్లించాల్సిందే. ఎరువులు, విత్తనాల ధరలు,కూలి రేట్లు పెరగడంతో పెట్టుబడి భారం అవుతుందని రైతులు తెలిపారు. కౌలుకు పొలం తీసుకుని సాగు చేసిన పంటలు నష్టానికి గురైతే ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయాన్ని పొందలేక దిక్కుతోచని స్థితిలో ఉండి పోతున్నామని తెలిపారు. రైతులకు రైతుబంధుతో పాటు కౌలు రైతులకు కౌలు బంధు ఇవ్వాలని గత ప్రభుత్వంపై ప్రతి పక్షాలు గోల చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, కౌలు రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించ లేదని విమర్శిస్తున్నారు. భూములున్న రైతులకు మాత్రమే రైతుబంధు, రైతు బీమా నష్టపోయిన పంటలకు ఇన్సూరెన్స్ తదితర పథకాలు రైతులకే అమలు చేసిందని కౌలు రైతులు వాపోతున్నారు. కష్టించి పంటలు సాగు చేస్తున్నా ప్రతిఫలం దక్కటం లేదని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు,బ్యాంకు నుండి రుణాలు అందడం లేదని తెలిపారు.వ్యవసాయమే జీవనాధారంగా బతికే కౌలు రైతు కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. రైతులకు ప్రభుత్వం నుండి ఏ పథకం పొంద లేక ఇబ్బంది పడుతున్నామని పంట పెట్టుబడి, రుణ సహాయం, నష్ట పరిహారం అందడం లేదన్నారు. కొత్త ప్రభుత్వంపైన కోటి ఆశలతో ఎదురు చూస్తున్నామని, అండగా నిలుస్తుందన్న ఆశతో ఉన్నామని సర్కారు కౌలు రైతులకు పెట్టుబడి సహాయం కింద కౌలు బంధును అందించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

# ములకలపల్లిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం



ప్రజాపక్షం/ములకలపల్లి: దేశ విద్యారంగాన్ని అబాసుపాలు చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని వెంటనే బర్త్ రఫ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చీమకుర్తి అజిత్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రాజు డిమాండ్ చేశారు. గురువారం విద్యాసంస్థల భారత్ బంద్ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా మండల పరిధిలోని ములకలపల్లి జూనియర్ కళాశాల, కస్తూర్బా, హైస్కూల్, మాదారం, పూసుగూడెం, జగన్నాధపురం, స్కూల్స్ విద్యార్థులు బంద్‌లో సంపూర్ణంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా చీమకుర్తి అజిత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తూ పేపర్ లీకులు , స్కాములు, పరీక్షలు రద్దు ద్వారా దేశ ప్రతిష్టను పరువు తీస్తున్నారని అన్నారు. లీక్ అయినట్లు నిందితులు అంగీకరించిన తర్వాత కూడా కేంద్రం విచారణ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని అన్నారు. దేశంలో పాఠశాలల మూసివేతను వెంటనే ఆపాలన్నారు. నీట్ రద్దు చేయడం ద్వారా నష్టపోయిన అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నీట్ స్కాంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చవ్వా సాయి, సంజయ్, అనూష, శ్రావణి, ఎమ్ నిశాంత్, కె శివ, పూసుగూడెం ఎస్ఎఫ్ఐ నాయకులు భూక్యా శివ, డివైఎఫ్ఐ నాయకులు గడ్డం జ్యోతిబాసు, ఏఐఎస్ఎఫ్ కమల్ , ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం తల్లడిల్లుతున్న తాటిపూడి గ్రామం

-నాలుగు రోజులుగా గ్రామంలో నిలిచిపోయిన తాగునీటి సరఫరా
-నీరు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
-అధికారులు తాగునీటి సరఫరా చేయాలని అంటున్న ప్రజలు









ప్రజాపక్షం/వైరా: వైరా మండలం తాటిపూడి గ్రామం గత గత నాలుగు రోజుల నుండి త్రాగునీటి కోసం అల్లాడుతుంది. గుక్కెడు త్రాగునీరు త్రాగేందుకు ఆ గ్రామ ప్రజలు పడరాని కష్టాలు పడుతున్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీ వద్ద ఉన్న త్రాగునీరు సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడో ఊరు చివరన వాగు వద్ద ఉన్న మోటార్ నుండి నీరు తెచ్చుకునేందుకు పడరాని కష్టాలు పడక తప్పడం లేదు. ట్రాక్టర్లు, ట్యాంకర్ ద్వారా ఆటోలో ట్యాంకర్ల ద్వారా నీళ్ళు తెచ్చుకుంటున్నారు. తమ ఇబ్బందులు గురించి ఎవరికి చెప్పినా స్పందించడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తాటిపూడి ఎస్సీ కాలనీలో ప్రజలు పడే ఇబ్బందులు చెప్పలేనివి. ఇటు బోర్లు లేక అటు నీరు అందక వారు పడుతున్న బాధతలు చెప్పలేని విధంగా ఉన్నాయి. మినరల్ వాటర్ కొనుక్కోవాలంటే ఎన్ని కొనాలి ఎన్ని రోజులు కొనాలి అని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరించడంలో ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాటిపూడి గ్రామం అంటేనే అంత చులకనగా చూస్తున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ సెక్రటరీ త్రాగునీటి విషయంలో తీవ్ర ఇబ్బందిపడుతున్న ఎందుకు అంత మౌనంగా ఉంటున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని తాటిపూడి గ్రామంలోని త్రాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలు ఇబ్బందులు తొలగించాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

**తాగునీరుకు ఇబ్బందులు పడుతున్నాం : కాంపెల్లి గురవయ్య**



గ్రామంలో నాలుగు రోజుల నుండి త్రాగునీరు రావడం నిలిచిపోయిందని నీళ్ళు త్రాగేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వృద్ధాప్యంలో ఉండి నీరు తెచ్చుకొని త్రాగాలి అంటే ఎంతో కష్టంగా ఉందని అధికారులు గ్రామంలో వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని తాటిపూడి గ్రామం దళిత కాలనీకి చెందిన కాంపెల్లి గురవయ్య అన్నారు.

## వైరా రిజర్వాయర్ ఆనకట్ట చెట్లపై మార్నింగ్ వాకర్స్ ఆందోళన

-శ్వాసకోశ వ్యాధులు వస్తాయని భయపడుతున్న వాకర్స్
-కట్టపై చెట్లతోనే ప్రమాదం అంటున్న ప్రజలు





ప్రజాపక్షం/వైరా: వైరా రిజర్వాయర్ ఆనకట్టపై ప్రతిరోజు ఉదయం పెద్ద ఎత్తున వాకింగ్ చేసేందుకు ప్రజలు చిన్న పెద్ద వృద్ధులు వయస్సు వారే అనే తేడా లేకుండా వస్తుంటారు. కాని ఇప్పుడు ఉదయం వాకింగ్‌కి వచ్చిన ప్రతిఒక్కరూ రిజర్వాయర్ ఆనకట్టపై ఉన్న చెట్లను గురించే చర్చించుకుంటున్నారు. ఆనకట్టపై వేసిన చెట్లు ఆరోగ్యానికి ఎంతో ప్రమాదకరమని, ఈ చెట్లు వలన శ్వాసకోశ సమస్యలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. గతంలో పలు ప్రాంతాల్లో రాష్ట్రవ్యాప్తంగా కట్టపై వేసిన లాంటి చెట్లను ప్రజలు అభిప్రాయం మేరకు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తొలగించిన సందర్భాన్ని కూడా మార్నింగ్ వాకర్స్ తెలుపుతున్నారు. ఎందుకంటే ఈ చెట్ల నుంచి ఆరోగ్యానికి ఇబ్బంది కలిగే పరిస్థితులు ఉన్నాయని ఆలోచన వాకర్స్ మదిలో ప్రతిఒక్కరి మధ్య చర్చనీయాంశంగా మారింది. మరోపక్క ఈ చెట్ల పెంపకం రిజర్వాయర్ ఆనకట్టకు కూడా ప్రమాదం లాంటిదని చెబుతున్నారు. ఇటు ప్రజలకు, అటు రిజర్వాయర్ ఆనకట్టకు ఇబ్బందికరంగా ఉన్న చెట్లను అధికారులు ఒకసారి పరిశీలించి పూర్తిస్థాయిలో వివరాలను తెలుసుకొని వాటిని తొలగించాలని ఉదయం వాక్కింగ్‌కు వచ్చిన ప్రజలు పలువురు తెలుపుతున్నారు. రిజర్వాయర్ ఆనకట్టపై వేసిన చెట్లు పెరుగుతున్న కొద్దీ ఆ చెట్ల వేర్లు కట్టలోకి బలంగా లోపలికి పోవడంతో పాటు గాలి దుమ్ములు వర్షాలు వచ్చినప్పుడు చెట్లు నేలకొరిగితే కట్ట పగిలిపోయి ప్రమాదం పొంచి ఉందని కూడా ఆరోపణ వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా కట్టపై ఉన్న చెట్లపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచిచూడాలి.

# పడకేసిన పారిశుధ్యం..!

-వర్షం వస్తే రోడ్డుపైనే మురికి నీరు
-దోమల నిలయాలుగా మారిన వైనం



ప్రజాపక్షం/పినపాక: మండలంలో వర్షాకాలం మొదలైందంటే కొత్త కొత్త రోగాలు కూడా మొదలవుతాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యం ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది.దోమలు, ఈగల తో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా గ్రామపంచాయతీ అధికారులు నిద్రపోతున్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్ చేయడం లేదు పారిశుధ్యంపై దృష్టిసారించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ఆ ప్రభావం ప్రజల ఆరోగ్యాల పై పడుతోంది. గ్రామీణ పల్లెల్లో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాలను బారిన పడుతున్న కూడా పట్టించుకునే వారే కరువయ్యారు. పినపాక మండల పరిధిలోని వెంకట్రావు పేట గ్రామ పంచాయతీలో పారిశుద్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో, చెత్తాచెదారం రోడ్డుపై దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామంలో ప్రజలు ఇళ్లలో ఉండలేక పోతున్నారు. దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వచ్చి పోయే వర్షాలకు నడుమ అపరిశుభ్రత వాతావరణం తాండవిస్తోంది. రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లేందుకు కనీస చర్యలు తీసుకోవాల్సిన గ్రామపంచాయితీ అధికారులు ఆ విషయాన్ని మరిచారు. దీని ఫలితంగా దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకొని విజృంభిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొద్దిరోజులు కొనసాగితే తమకు ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్లపై ఉన్న మురికి నీరు ప్రాంతాలలో రహదారిని బాగు చేసి ఇబ్బందులు తీర్చాలని గ్రామంలో నివసిస్తున్న ప్రజలు కోరుతున్నారు.

## విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలు విద్యార్థి సంఘాల పిలుపుకు సంపూర్ణ బంద్ నిచ్చాయని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు జహూర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలపై సమగ్ర విచారణను జరపాలని డిమాండ్ చేశారు. నీట్‌పై సమగ్ర విచారణ కోసం డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు దేశ వ్యాప్తంగా గురువారం పాఠశాలలు, కళాశాలలు బంద్‌కు పిలునిచ్చిన నేపథ్యంలో బూర్గంపాడు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారని, అసమర్థంగా పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## నేడు మహాధర్నా

ప్రజాపక్షం/బూర్గంపాడు:13వ వేతన ఒప్పందంలోని పెండింగ్ అంశాల పట్ల యాజమాన్య మొండి వైఖరి, గుర్తింపు సంఘ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నేడు మహాధర్నా కార్యక్రమం జనరల్ షిఫ్ట్ నందు నిర్వహిస్తున్నట్లు బిఆర్‌టియూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సానికొమ్ము శంకర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐటిసిలో 13వ వేతన ఒప్పంద కాలం చివరి దశలో ఉన్నందున, ఎల్‌టీఏ ప్రకారం సంవత్సరానికి ఒక్కో ఫేజు చొప్పున పూర్తి చేయనందున, మొత్తం ఫేజులను ఒకేసారి ప్రారంభిస్తూ ఈ వేతన ఒప్పంద సమయంలోనే పూర్తి చేయాలన్నారు. 28జూన్ 2024 కాలనీ ఓల్డ్ కోటర్స్ గూర్చి పెట్టిన సర్క్యూలర్ రద్దు చేస్తూ, ప్రస్తుతం వేకెన్సీ ఉన్న అని కోటర్స్‌కు ఒకే సారి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. వేతన ఇప్పందం ప్రకారం ఈ 3 గ్రేడ్ కలిగిన కార్మికులందరికీ కోటర్స్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాలో కార్మిక సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకై మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## మోరంపల్లిబంజర్ వారపు సంత వేలం ఖరార్



ప్రజాపక్షం/బూర్గంపాడు: మోరంపల్లిబంజర్ వారపు సంత వేలం పాట గురువారం నిర్వహించారు. మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి, ఎంపిడివో జములారెడ్డి అధ్యక్షతన డివిల్‌పివో సుధీర్ ఆధ్వర్యంలో సంత పాటను రూ 26లక్షల 45వేలను అశ్వాపురం మండలం అశ్వాపురం గ్రామానికి చెందిన తేజావత్ కోటేశ్వరరావు పాటను కైవసం చేసుకున్నారు. ఈసంవత్సరం కనీస మద్దతు ధర రూ 22లక్షల 24వేలుగా నిర్ణయించారు. కాగ సంత వేలం పాటను రూ 23లక్షల నుండి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపివో సునీల్ శర్మ, పంచాయితీ కార్యదర్శులు భవాని, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్**






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా, సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపివోలతో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు నష్టం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల, మున్సిపాలిటీల స్థాయిలో వారి వారి పరిధిలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగతాయో గుర్తించి వాటిని సరిదిద్దాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉన్న వారిని ముందు రోజు సురక్షిత ప్రాంతానికి చేర్చాలని ఇందుకు ప్రతి గ్రామంలో ఒక భవనాన్ని గుర్తించి సిద్దంగా ఉంచాలన్నారు. ప్రతి మురికి కాలువను ప్రారంభం నుండి తుది వరకు పరిశీలించి కురిసిన వర్షం బయటకు వెళ్తుందా అనేది చూడాలన్నారు. ప్రతి మురికి కాలువకు డిసిల్టింగ్ చేసి ఎక్కడ నీరు ఆగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు సంభవిస్తే ప్రతి వార్డు, గ్రామ స్థాయిలో ఒక బాధ్యత గల అధికారిని కేటాయించి, ఆ అధికారి ఫోన్ నెంబర్, ఆ గ్రామాల్లో, వార్డుల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. అధికారులు ఇట్టి విషయమై పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. సమస్యలు వచ్చినప్పుడు మందుల రవాణాకు ఇబ్బందులు కలుగుతాయని ఇట్టివి జరగకుండా ముందస్తుగా ప్రతి వార్డు, గ్రామ పంచాయితీలో ఒక భవనాన్ని గుర్తించి మందులు స్టాక్‌లో ఉంచాలన్నారు. నీటి నిల్వలు ఉండడంతో దోమలు, అపరిశుభ్రత దృష్ట్యా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం లేకుండా ప్రతి డ్రైన్‌ను శుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్‌ను తొలగించడం, బ్లీచింగ్, ఫాగింగ్ చేయడం చేయాలన్నారు. ఫీవర్ సర్వే చేయాలని, వైద్య శిబిరాల నిర్వహణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నియంత్రణపై వాట్సాప్ సందేశాలు గ్రూపుల్లో పోస్ట్ చేయాలన్నారు. డ్రైడేను పకడ్బందీగా చేపట్టాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు పక్కగా చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో విఓలతో సమావేశాలు నిర్వహించి ముందస్తు చర్యలపై అవగాహన కల్పించాలని ఇట్టి సమావేశాల్లో వైద్యాధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సురక్షిత తాగునీరు అందేలా చూడాలన్నారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు క్లినింగ్, క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ, పైపులైన్ల లీకేజీల నియంత్రణ వెంట వెంటనే చేపట్టాలన్నారు. నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా వాటిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈనెల 10 లోగా మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు సమన్వయంతో అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్, డిఆర్‌డివో సన్యాసయ్య, జెడ్పిసిఈవో ఎస్. వినోద్, డిపివో హరికిషన్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సైదులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం అస్థిత్వాన్ని కాపాడాలి

**-ఆంధ్రాలో విలీనం చేసిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి**

**-సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా**



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** దక్షణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం ప్రాంత అస్తిత్వాన్ని కాపాడే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, అభివృద్ధికి ఆటంకంగా మారిన విభజనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనం చేసిన కన్నాయిగూడెం, ఎటపాక, పిచ్చుకలపాడు, పురుషోత్తమపట్నం, గుండాల పంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో విలీనంచేయాలనే అంశంపై గురువారం శేషగిరి భవన్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగాల్సిన ఐదు పంచాయతీలను విడదీసి తీరని అన్యాయం చేశారన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల్లో ముడిపడి ఉన్న ఈ ప్రాంత ప్రజలను ఏకపక్షంగా వేరుచేసి భద్రాచలం డివిజన్‌ను మూడు మండలాలకే పరిమితం చేశారన్నారు. పంచాయతీల పునః విలీనం కోసం ప్రజల నుంచి డిమాండ్ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమైందన్నారు. భద్రాచలం అభివృద్ధికి ఈ ప్రాంత గిరిజనుల సంక్షేమానికి ఆటంకంగా మారిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని, భద్రాచలం అభివృద్ధికి వంద కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఈ బడ్జెట్ సమావేశాల్లోని ఐదు పంచాయతీలను తెలంగాణలో కలుపుతూ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని సాబీర్ డిమాండ్ చేశారు.

# కొమరయ్య స్ఫూర్తితో పోరాటాలు

**సిపిఐ(ఎంఎల్) ఎన్డి ఆధ్వర్యంలో ఘనంగా కొమరయ్య వర్ధంతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు జేవి చలపతిరావు, ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎంఎల్) రెండు రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో సిపిఐ(ఎంఎల్) ఎన్డి రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, గౌని ఐలయ్య అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఎజెండా మీదకి తెచ్చిన భూ సమస్య నేటికీ కీలకంగానే కొనసాగుతుందన్నారు. దేశంలో కొనసాగుతున్న అర్ధ ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాల మౌలిక మార్పులు ఏమి రాలేదని వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు అర్థ ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలకు లోబడి ఉన్నాయన్నారు. నేటికీ 65 శాతానికి పైగా నిరుపేద ప్రజల చేతుల్లో సెంట్ భూమి కూడా లేదన్నారు. దేశంలో ఉత్పత్తి శక్తులైన రైతాంగం, కార్మిక వర్గం పై దేశ దళారి పాలక వర్గం దాడిని ముమ్మరం చేసిందని వారి హక్కులను హననం చేసే విధానంలో భాగంగా నేడు సాగు నల్ల చట్టాలను, లేబర్ కోడ్స్‌ను ముందుకు తెచ్చిందన్నారు. దొడ్డి కొమరయ్య స్ఫూర్తి ప్రజా సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డి రాష్ట్ర నాయకులు వి. కోటేశ్వరరావు, కె. గోవర్ధన్, పివోడబ్ల్యూ జాతీయ నాయకులు వి. సంధ్య, రాజేంద్రప్రసాద్, ఇఫ్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ తదితరులు ప్రసంగించగా పలు తీర్మానాలను సభలో ఆమోదించింది. ఈ ర్యాలీలో కె. లక్ష్మి నారాయణ, బజ్జూరి వెంకటరామిరెడ్డి, ఎస్‌కె ఖాసిం, వై. ప్రకాష్, రమేష్, ఐ. వెంకన్న, వివిరావు, జే. సీతారామయ్య, జడ సత్యనారాయణ, మురళి, ఎం. గిరి, సురేష్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం




**ప్రజాపక్షం/కొణిజర్ల :** నీట్ పరీక్ష పేపర్ల లీకేజీలను నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా కొణిజర్ల మండలంలోని చేపట్టిన విద్యాసంస్థల బంద్ గురువారం విజయవంతం జరిగింది. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మం సమితి సభ్యులు అంబాల గౌతమ్ మాట్లాడుతు నీట్ పరీక్ష లీకేజీ వలన నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థులకు , తల్లి తండ్రులకు పూర్తిస్థాయి భరోసా కల్పించడంలో కేంద్రంలోని నరేంద్రమోది ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దేశావ్యాప్తంగా నీట్ పేపర్ రాసిన 24 లక్షల మంది విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. పేపర్ లీకేజీ పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించి దోశులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీస్ ఎన్‌టిఏను రద్దు చేయాలని పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి దేవేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సాయి , నరేష్ , యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ నందు కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న మాలోతు శంకర్ తన ఇంటి వద్ద జారిపడటంతో తన రెండు కాళ్ళు విరిగి గత నెల రోజుల నుండి డ్యూటీకి రాలేక ఆర్థిక ఇబ్బందులను కుటుంబ పరిస్థితిని గమనించిన సివిల్ డిపార్ట్‌మెంట్ లోని అధికారులు, పర్మినెంట్ ఉద్యోగులు అందరూ కలిసి సేకరించిన రూ.23400లను డిజిఎం, సివిల్ పి.రాజశేఖర్ మాలోతు శంకర్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలోని ఏటిఐయుసి కార్పొరేట్‌జనరల్ సెక్రటరీ ఎస్‌వి.రమణమూర్తి, పిట్ సెక్రటరీలు, అధికారులు, సివిల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం







**ప్రజాపక్షం/ మధిర :** నీట్ పేపర్ లీకేజిని నిరిసిస్తూ దేశావ్యాప్త విద్యాసంస్థల బంద్ లో భాగంగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మధిర పట్టణంలో గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజిపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దుయ్యబట్టారు. పేపర్ లీకేజి వ్యవహారంలో సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, కేంద్రం ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు అన్నవరపు రామకృష్ణ, చంపసాల శ్రీకాంత్, వెంకటేష్, అశోక్, గోపి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ క్రీడాకారుడికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ మధిర :** మడుపల్లి జెడ్పిహెచ్ఎస్ పూర్వ విద్యార్థి కబడ్డీ క్రీడాకారుడు పీట్ల గోపికి సీవిఆర్ చిట్స్ అధినేత చెరుకూరి వెంకటేశ్వరరావు రూ.20వేలు ఆర్థిక సహాయం చేశారు. పీట్ల గోపి గత నాలుగు సంవత్సరాలుగా కబడ్డీ క్రీడలో రాణిస్తూ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రథమ బహుమతులు గెలుపొందటమే కాక కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రస్తుతం నర్వాల్ కబడ్డీ అకాడమీ హర్యానాలో శిక్షణ తీసుకునేందుకు రూ.8వేలు చొప్పున ఐదు సంవత్సరాలు శిక్షణ తీసుకోవాల్సి ఉండగా చెరుకూరి వెంకటేశ్వరరావు పెద్ద మనుస్సుతో రూ.20వేలు విరాళంగా అందించారు. ఇంకా దాతలు ప్రోత్సాహం ఉంటే కబడ్డీ క్రీడలో పీట్ల గోపి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకువస్తాడని హెచ్ఎం తోట నర్సింహారావు తెలిపారు.

# ఎంవి పాలెం పాఠశాలకు బీరువా బహుకరణ



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని ఎం,వెంకటాయపాలెం జిల్లా పరిషత్‌ఉన్నతపాఠశాలకు కూసుమంచి మండలం గంగబండతాండా పాఠశాల ఉపాధ్యాయుడు గుండా రవీందర్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థంగా రూ.7వేల విలువగల ఇనుప బీరువను గురువారం బహుకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన నిలిచిన చావా



## పదో వర్ధంతి సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** సాయుధ తెలంగాణ పోరాటంలో దొరల ఆధీనంలో ఉన్న భూములను పోరాడి పేద ప్రజలకు పంచిన ఘనత చావా వెంకటేశ్వరావు కి ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో చావా వెంకటేశ్వరావు పదో వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ చావా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఉన్నతమైన జీవితం గడుపుతున్న పేద ప్రజల కోసం అనునిత్యం వారికి సేవలు అందించాలని ఉద్దేశంతో కమ్యూనిస్టు భావాలని కలిగిన వెంకటేశ్వరరావు తెలంగాణ సాయుధ పోరాటంలో పేద ప్రజల పక్షాన పోరాడి అప్పటి దొరల ఆధీనంలో ఉన్న భూములను వీరోచితంగా పోరాడి పేదవారికి పంచిన ఘనత చావా వెంకటేశ్వరావుకు ఉంటుందని ఆయన అన్నారు. ఆయన మరణించి పది సంవత్సరాల అవుతున్న గ్రామంలో ఇప్పటికీ ఆయన ప్రజలు ఆయనను స్మరించుకుంటున్నారు. అప్పటి రోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదల కోసం కోసం ఎన్నో విధాలుగా శ్రమించారు. ప్రతి ఒక్కరు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ మూలాన, జిల్లా కార్యవర్గ సభ్యులు దంతాల బాలరాజు, మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, మండల సహాయ కార్యదర్శి చీమ రామకృష్ణ, సానుభూతిపరులు చావా, వెంకటావు చావా, రాజేష్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎం సరిరామ్‌ను కలిసిన ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టిజిఎస్ఆర్‌టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అజ్మీర సరిరామ్‌ను టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజియన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆర్ఎం సరిరామ్‌ను ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువలతో ఘనంగా సన్మానించారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజినల్ కమిటీ అధ్యక్షులుగా జి. శ్రీనివాసరావు, రీజినల్ కార్యదర్శిగా పిల్లి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. సుధీర్ గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆర్ఎంకు తెలిపారు. అదేవిధంగా ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులను మరియు రీజినల్ కమిటీ సభ్యులను ఆర్ఎంకు పరిచయం చేశారు. ఖమ్మం రీజినల్ పరిధిలోని కార్మికుల సమస్యలు తమ దృష్టికి వస్తే సాధ్యమైనంత వరకు సానుకూలంగా పరిష్కరించాలని ఆర్ఎంను కోరారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఉన్నటువంటి కార్మికుల సమస్యలను ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణకుమారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. రామచంద్రరావు, నాయకులు జే. కిరణ్‌కుమార్, డి. శ్రీనివాసరావు, ఖమ్మం డిపో అధ్యక్షులు దేశబోయిన జగన్నాథం, డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు, కోశాధికారి దామాల లాజర్, మహిళా ప్రతినిధి కె. ఆదిలక్ష్మి, ప్రదీప్‌కుమార్, మధిర డిపో కోశాధికారి ఎస్‌కె రహీం, మణుగూరు డిపో కార్యదర్శి పవన్‌కుమార్, భద్రాచలం డిపో కార్యదర్శి రమణారావు, వీరయ్య, మధు తదతరులు పాల్గొన్నారు.



# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఎన్‌టిఏ సంస్థల నిర్లక్ష్య విధానం వలన నీట్ పరీక్ష పేపర్లు లీకులకు నైతిక బాధ్యతగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు గణపరపు ఉపేందర్, జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థి సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త పిలుపుమేరకు ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం, వరంగల్‌క్రాస్‌రోడ్డులోని పాఠశాలలను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బంద్ చేపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతిసారి లీకుల ద్వారా విద్యార్థులు కష్టపడి చదివిన చదువుకు ప్రతిఫలం దక్కకుండా పోతుందన్నారు. దీంతో వారి బంగారు భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు మరో మారు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మరల పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాల్సిందిగా కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు నీట్ పరీక్షలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షుడు మేళ్లచెర్వు సాయి, యువజనసంఘం సభ్యులు రెబ్బగొండ్ల గోపి, పొన్నకంటి చక్రవర్తి, మామిడాల కిరణ్, గణపరపు విగ్నేష్, మేళ్లచెర్వు రవి, దొంతగాని ఉపేందర్, వెన్నెబోయిన అజయ్, కత్తి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా దొడ్డి కొమరయ్య వర్ధంతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, భూమి కోసం, భుక్తి కోసం, జాతి విముక్తి కోసం ప్రాణాలొడ్డిన తెలంగాణ ముద్దుబిడ్డ దొడ్డి కొమరయ్య అని ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్‌డివో సన్యాసయ్య తెలిపారు. దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఖమ్మం ట్యాంక్ బండ్ వద్ద గల కొమరయ్య విగ్రహానికి అధికారులు, బిసి సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగంగా కొందరి చేతిలో కేంద్రీకృతమైన వేలాది ఎకరాల భూమిని వారి కబంధ హస్తాల నుంచి విముక్తి చేసి పేదలకు పంచిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిబిసిడివో జ్యోతి, ఏబిసిడివో మండుల ఈదయ్య, బిసి సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, రామ్మూర్తి, బమ్మిడి శ్రీనివాస్, అమరగాని వెంకన్న, సిహెచ్ మల్లేశం, ఆర్. ఉపేందర్, ఎస్‌కె షకీనా, పగడాల నాగరాజు, జ్యోత్స్నానాయక్, ప్రసన్న కృష్ణ, ఉపేందర్, పాపారావు, విజయ రామకృష్ణ, పి. రమణకుమార్, శ్రీరాములు, లక్ష్మణ్‌రావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నాగపూర్ టూ అమరావతి రోడ్డుకు హైకోర్టు స్టే

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నాగపూర్ టూ అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే (ఎన్‌హెచ్163జి) నిర్మాణానికి సంబంధించి గురువారం హైకోర్టు స్టే విధించింది. ఖమ్మంజిల్లా పరిధిలోని రూరల్ మండలం తీర్దాల నుంచి రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం సెక్షన్ పరిధిలో ఈ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి 29 మంది రైతులు, ప్లాట్ల యజమానులు నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే ఖమ్మం కార్పోరేషన్ మధ్య నుంచి వెళ్తుందని దీని వల్ల మూడు లక్షల మంది నగరవాసులకు ఆరోగ్యం పై ప్రభావం చూపుతుందని, ఎన్‌హెచ్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఎలైన్‌మెంట్ చేయడం పై హైకోర్టు న్యాయవాది హరిబాబు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఈ వాదనలపై హైకోర్టు స్టే ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు బాధిత రైతుల భూములను స్వాధీనం చేసుకోవద్దని హైకోర్టు ఉత్తర్వులో తెలిపింది.

# వివేకానంద జీవితం నేటి తరానికి ఆదర్శం



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** వివేకానంద జీవితం నేటి తరం కు ఆదర్శమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ సూచించారు. మండలం లోని కొత్త కొత్తూరు గ్రామంలో గురువారం వివేకానంద వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..వివేకానంద చూపిన మార్గం ను అనుసరించాలని సూచించారు. బాల్య వివాహాలు, నిరక్షరాస్యత నిర్మూలనకు విశేషంగా కృషి చేశారని అన్నారు. వివేకానంద ఆశయాలు సాధన కోసం ప్రతీ ఒక్కరూ పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన గోపి, మూడు రమేష్, కళ్యాణం నాగేశ్వరరావు, జడ కోటేశ్వరరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

# రాకేష్‌కు బాసరలో సీటు



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని ఆరెగూడెం కు చెందిన విద్యార్థి గోరెంట్ల రాకేష్ బాసర త్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. మండలం లోని ఆరెగూడెం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి 9.8 జీపీఏ ను సాధించాడు. మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు ను సాధించారు. బాసరలో త్రిపుల్ ఐటీ లో సీటు సాధించిన సందర్భంగా గురువారం రాకేష్ ను పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి చలపతిరావు మాట్లాడారు...ప్రభుత్వ పాఠశాలలో చదివిన రాకేష్ బాసరలో సీటు సాధించటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. మాజీ సర్పంచ్ దొనకొండ రామకృష్ణ, గ్రామ పెద్దలు గొలుసు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్కా మృతి



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండల కేంద్రంలో గుర్కా (వాచ్‌మేన్) గా పని చేస్తున్న నేపాల్ కు చెందిన చైత్రూ రాజ్ బహదూర్ (52) గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేపాల్ దేశం, సుచర్‌పాశం రాష్ట్రం, బజింగ్ జిల్లా, దుర్గాతల్లికాపాల్లిక గ్రామానికి చెందిన రాజ్ బహదూర్ నేలకొండపల్లి పట్టణంలో గత 25 ఏళ్ల నుంచి గుర్కా (వాచ్‌మేన్) గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సైకిల్ పై ఇంటికి వెళ్తుండగా....ఫిట్స్ రావటంతో సైకిల్ పై నుంచి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. నేలకొండపల్లిలో ప్రతీ ఒక్కరికి సుపరిచితుడు గా ఉన్నారు. మృతుడు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి భార్య సొంత గ్రామం ఏపీలోని తిరువూరు కు మృతదేహం ను తరలించారు. మృతదేహం ను పలువురు సందర్శించి నివాళులు అర్పించారు.

# ఏదులాపురం విద్యార్థినికి బాసర సీటు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామానికి చెందిన దిగుట్ల సాహితీ బుధవారం విడుదలైన బాసర ట్రిబుల్ ఐటీకాలేజ్ ఫలితాల్లో సీటును సాధించింది. ఈ సందర్భంగా గురువారం జిల్లా పరిషత్‌ఉన్నతపాఠశాలలోప్రధానోపాధ్యాయురాలు బి.శివకుమారి ఆధ్వర్యంలో విద్యార్థినికి ఉపాధ్యాయులు బొకేను అందజేసి సన్మానించారు. అలాగే సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ విద్యార్థినికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ ఘనతను సాధించిన విద్యార్థినిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు. సదరు విద్యార్థిని టెన్త్ రిజల్ట్‌లో 9.7జీపీఏను సాధించి, తాజాగా మండలంలోనే ట్రిబుల్ ఐటీ సీటు సాధించిన మొదటి విద్యార్థినిగా నిలిచింది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం అందించిన నేషనల్‌మీన్స్, మెరిట్‌స్కాలర్‌షిప్ (ఎన్ఎమ్ఎమ్ఎస్)ను పదవతరగతి విద్యార్థినిగా ఉన్నప్పుడు పొందింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఏ, భాస్కర్‌రావు, జి. జలంధర్, ఈ, వెంకటనరసయ్య, బి. మాలిని, ఎం గద్దయ్య, బి.లలిత, బి, భారతి, ఏ, నవీన పాల్గొన్నారు.

# కొమరయ్య స్ఫూర్తి అజరామరం




**-ప్రజా పోరాటాలకు సిద్ధంకండి**
**-కొమరయ్య వర్ధంతి సభలో పోటు ప్రసాద్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య మరణం యావత్ పోరాటానికి ఒక ఊపునిచ్చిందని ఆయన స్ఫూర్తి అజరామరమని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. చరిత్ర ఉన్నంత కాలం కొమరయ్య పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల జితేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కొమరయ్య వర్ధంతి సభలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాం రక్కసి ప్రభుత్వం ప్రజలను హింసించేదని, మాట్లాడే హక్కుతో సహా ఏ హక్కు ఉండేది కాదన్నారు. నిజాంకు తోడు జమీందారులు, జాగీర్‌దార్లు గ్రామాల్లో ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా చేశారని అటువంటి వారిలో విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ప్రథముడని ఆయన తల్లి జానకమ్మ అరాచకత్వానికి హద్దేలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమయంలో ఆంధ్ర మహాసభ స్ఫూర్తి గ్రామాలలో యువకులు సంఘాలు ఏర్పడిన అరాచకాలను అడ్డుకున్నారన్నారు. కడివెండి గ్రామంలో గ్రామ రక్షణ దళాలు ఆంధ్ర మహాసభ కార్యకర్తలు జమీందారి వ్యతిరేక పోరాటం నిర్వహించారని అది సహించేలేని రామచంద్రారెడ్డి అనుకూల రౌడీముక జరిపిన కాల్పుల్లో కొమరయ్య మృతి చెందాడని ప్రసాద్ తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని ఆయన మరణం తెలంగాణ వ్యాప్తంగా ఒక స్ఫూర్తిని రగిల్చిందని వేలాది మంది సాయుధులు మారడంలో నిజాం ప్రభుత్వం తలవంచక తప్పలేదన్నారు. ప్రజలకు వెన్నంటి నిలిచిన కొమరయ్య స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ నిరంకుశ విధానాలతో ప్రజల గొంతుకలను నొక్కేయాలని చూస్తున్నదని ఆ క్రమంలోనే నూతన చట్టాలు పుట్టుకొచ్చాయన్నారు. స్వేచ్ఛను హరించేందుకు ప్రశ్నించే తత్వాన్ని నిలువరించేందుకు ఈ చట్టాలను తీసుకొచ్చారని దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న మోడీ ప్రభుత్వం పునరాలోచన చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రజలను మరిచి పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలకు యువత సిద్ధం కావాలని ప్రజా పోరాటాలే అమరులకు సరైన నివాళి అని ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు వై. సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, నానబాల రామకృష్ణ, తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, బోడా వీరన్న, పాటి అప్పారావు, ఎస్‌కె సైదా, పూర్ణ, జ్వాలా నర్సింహారావు, ఆముదాల వెంకటేశ్వర్లు, అక్రం తదితరులు పాల్గొన్నారు.

# కొమరయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

**-సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా**
**-సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి**



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** భూస్వామ్య దోపిడి వ్యవస్థకు పెత్తందారి ఏకస్వామ్య పోకడలకు వ్యతిరేకంగా దొడ్డి కొమరయ్య చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన అమరత్వం విముక్తి పోరాటాలకు ప్రేరణగా నిలుస్తుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతిని సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ సామాన్య కుటుంబానికి చెందిన రెండు పదుల వయస్సు కూడా దాటని వయస్సులో నాటి నిజాం దురగతాలకు , దొరల అచారకాలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో తెలంగాణ గడ్డపై ఒరిగిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని అన్నారు. కడవెండిలో రెవిన్యూ పోలీసులతో ప్రజలనుంచి ధాన్యాన్ని పన్ను విధించిన పరిస్థితిలో లేవీ ధాన్యాన్ని వసూలు చేయడాన్ని నిరసిస్తూ సాగిన వీరోచిత పోరాటంలో అగ్రభాగాన నిలిచి తుపాకి తూటాలకు బలయ్యాడని , ఆయన మరణంతోనే తెలంగాణ సాయుధ పోరాటానికి అంకురార్పణ జరిగిందని, దొడ్డి కొమరయ్య మరణంతోనే నిజాం నాటి తెలంగాణ అంతటా నిరసనలు ప్రారంభమై సాయుధ పోరాటంగా మారిందని గుర్తు చేశారు. దొర, భూస్వామ్య, పటేల్ పట్వారీ వ్యవస్థలను కూల్చడానికి కొమరయ్య మరణం విప్లవ రూపాన్ని తీసుకొచ్చిందన్నారు. నాటి అమరనేతల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పాలకులపై తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జక్కుల రాములు, పోగుల కోటేశ్వర్‌రావు, తాళ్ల వెంకటేశ్వరరావు, ముక్కెర మురళి, కొచ్చర్ల జోసెఫ్, నదీమ్, రాకేష్, రజనికుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించొద్దు

**ఏఐటియుసి కేంద్ర కమిటీ నాయకులు మిరియాల**



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** గురువారం స్థానిక శేషగిరి భవన్ నందు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటియుసి నాయకులు వీరస్వామి అధ్యక్షతన వహించగా సమావేశంలో మిరియాల రంగా మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఏ ప్రభుత్వం పదో విడత వేలం ప్రక్రియ ప్రారంభించిందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాక్‌లను కూడా వేలం పెట్టడాన్ని తెలంగాణ కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ బ్రిటీష్ కాలంలోనే హైదరాబాద్ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థగా ఎదిగిందని అన్నారు. కార్మికుల కష్టార్జితంలో లాభాల్లో కొనసాగుతుందన్నారు. సింగరేణి కేంద్ర రాష్ట్రాలకు డివిడెన్స్ పన్నుల రూపంలో ప్రతి సంవత్సరంలో రూ.8000కోట్లు చెల్లిస్తుందన్నారు. మైండ్స్ మినరల్ డవలప్‌మెంట్ రెగ్యులరేషన్ యాక్ట్‌లోని 17ఏ ప్రకారం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని అన్నారు. గతంలో కొన్ని బ్లాక్‌లను ప్రైవేటుపరం చేయడం వలన సంస్థ కార్మికులు నష్టపోయారన్నారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ నుండి సింగరేణి సంస్థ కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను అడ్డుకొనుటకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లోని కలెక్టర్ ఆఫీసుల ముట్టడి చేయాలన్నారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉందని సింగరేణి సంస్థ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు కంచర్ల జమలయ్య, వంగా వెంకట్, వీరస్వామి, గిద్దాడ నగేష్, కోటేశ్వరరావు, గట్టయ్య, ఐఎన్‌టిసి నాయకులు జలాల్‌పాషా, త్యాగరాజన్, ఆల్బర్ట్ సిఐటియు నాయకులు బ్రహ్మాచారి, శ్రీనివాస్, వీరన్న, ఐఎఫ్‌టియు నాయకులు యాకూబ్‌పాషా, మల్లికార్జున్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల భారత్ బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** దేశ విద్యారంగాన్ని అబాసుపాలు చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ ఫహీమ్‌పాషా, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి హరికృష్ణ డిమాండ్ చేశారరు. గురువారం విద్యాసంస్థల భారత్ బంద్ ఏఐఎస్‌ఎఫ్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణ పరిధిలోని జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బంద్‌లో సంపూర్ణంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ విద్యారంగాన్ని అబాసుపాలు, పేపర్ లీకులు, స్కామ్‌లు, పరీక్షలు రద్దు ద్వారా దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని అన్నారు. పేపర్ లీక్ అయినట్లు నిందితులు అంగీకరించిన తర్వాత కూడా కేంద్రం విచారణ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. మన రాష్ట్రంలో కూడా నీట్ లీకేజీ వలన విద్యార్థులు ర్యాంకులు మారి గందరగోళం ఏర్పడిందన్నారు. అత్యున్నత వైద్య, విద్య అమ్మకానికి పెట్టారని అన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ ఫీజుల దందా నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పాఠశాలల మూసివేతను వెంటనే ఆపాలని అన్నారు. నీట్ రద్దు చేయడం ద్వారా నష్టపోయిన అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు, నీట్ స్కాంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు జరుపుల ఉపేందర్, వినయ్, శివ, విజయ్, కాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి




**ప్రజాపక్షం/ బోనకల్ :** నీట్ పరీక్ష లీకేజిపై విచారణ జరిపించి ఎన్‌టిఏ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ మధిర డివిజన్ నాయకులు షేక్ ఖాసీంబాజీ డిమాండ్ చేశారు. గురువారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ బోనకల్ మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి, యూజిసి చైర్మన్‌ను, ఎన్‌టిఏ చైర్మన్‌లను భర్తరఫ్ చేయడంతో పాటు నీట్ పరీక్ష ఫలితాలను తక్షణమే రద్దు చేసి పరీక్షను మళ్లీ నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజిపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు సాయి, గోపి, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం




**ప్రజాపక్షం/ఏన్కూరు:** నీట్ పరీక్షల ప్రశ్న పేపర్ల లీకేజీలను నిరసిస్తూ వామపక్ష విద్యార్థియువజన సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగం గా గురువారం ఏన్కూరు మండలవ్యాప్తంగా విద్యాసంస్థల బబంద్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి శివ నాయక్ మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకేజ్ వలన నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థులకు , తల్లిదండ్రులకు పూర్తిస్థాయి భరోసా కల్పించడంలో కేంద్రంలోని నరేంద్మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా 24లక్షల మంది వ్రాసిన నీట్ పేపర్ లీకేజి ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజీ వలన నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, ఎన్‌టిఏను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు, శ్రీకాంత్, రవి, గోపి, సాయిచందు, కృష్ణా, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.